పచ్చిరొట్టతో పసిడి పంటలు

- సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి
- ఆసక్తి చూపుతున్న రైతులు
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు



జీలుగ పంట

పెద్దవంగర: నూతన వ్యవసాయ విధానంలో రసాయనిక ఎరువులు క్రిమిసంహారక మందులు విరివిరిగా వాడటంతో భూసారం దెబ్బతిననడం, వాతావరణ కాలుష్యం, పంటల దిగుబడులు తగ్గడం, సారవంతమైన భూములు సమస్యాత్మక భూములుగా మారడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో భూమిలో సేంద్రియ కర్బనం, సేంద్రియ పదార్థాలను పెంపొందించి భూసారం కాపాడుతూ పంటల ఉత్పాదకతను పెంపొందించడానికి వ్యవసాధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

మండలంలోని సుమారు 8వేల మంది రైతులు 25వేల ఎకరాల్లో పలు పంటలను సాగు చేస్తున్నారు. అందులో వరిసాగు 13వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా మిగిలిన 12వేల ఎకరాల్లో ఇతర పంటలను పండిస్తున్నారు. కాగా నీటి వసతి ఉన్నా ప్రాంతాల్లో రైతులు ఎక్కువ శాతం వరి పంటను అధికంగా సాగు చేస్తున్నారు. వరిని పండించే రైతులు పెట్టుబడులు తగ్గించేందుకు గాను జీలుగ, జనుము సాగు చేయాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

జీలుగ సాగు విధానం..

వర్షాకాలం ఆరంభం కాగానే వరి పంటను వేసే పొలంలో ఎకరాలకు 25కేజీల చొప్పున జీలుగ విత్తనాలను, పది కిలోల యూరియాతో కలిపి వెదజల్లాలి. విత్తనాలు వెదజల్లిన తర్వాత దుక్కిని దున్నాలి. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా 30నుంచి 40 రోజుల్లో ఏపుగా ఎదిగి పూత దశకు చేరుకుంటుంది. ఈదశకు వచ్చిన జీలుగ పంటను కలియదున్ని నీటిని పెట్టడం వల్ల జీలుగ పంట కుళ్లిపోయి ఎరువుగా తయారు అవుతుంది. ఈ సమయంలో వరి నాటు వేసుకోవాలి.

ఉపయోగాలు..

జీలుగ పంటలకు కావాల్సిన బలాన్ని అందిస్తుంది. వరి పంటకు కావాల్సిన మూడు టన్నుల ఎరువు పచ్చి రొట్టె ఎరువుల ద్వారా లభిస్తుంది. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి ఎంతో దోహదపడుతుంది. జీలుగ మొక్కలను భూమిలోకి దున్నడం వల్ల నత్రజనిని 27 శాతం, భాస్వరం 53శాతం, పొటాషియం 22శాతం పంటలోని మొక్కలకు అందజేస్తాయి. వరి పంటల్లో జీలుగును వాడడం వల్ల ఎకరాకు 50కేజీల యూరియా, 25కేజీల డీఏపీని తగ్గడంతో పాటు రైతులకు పంట ఖర్చుతగ్గి ఆదాయం పెరుగుతుంది. చీడపీడల దరిచేరవు చౌడు భూములు సైతం సారవంతంగా మారుతాయి. మిర్చి పంట సాగు చేసే రైతులు కూడా జీలుగ, జనుమును విత్తనాలను వెదజల్లుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సబ్సిడీపై విత్తనాలు..



సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం కోసం పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నాం. మండలంలో 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. బస్తాకు రూ.1,116 చెల్లించి రైతులు విత్తనాలు తీసుకోవచ్చు.

– కుమార్ యాదవ్, ఇన్‌చార్జ్ ఏఓ, పెద్దవంగర

క్లుప్తంగా

ఎన్నికల కోఆర్డినేటర్‌గా వీరన్న నియామకం



మహబూబాబాద్ రూరల్: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కమిటీ కోఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన సిరిపురం వీరన్న ఆదివారం నియామకం అయ్యారు. ఆదివారం కమిటీ కన్వీనర్ దిలీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కోఆర్డినేటర్‌గా కత్తి స్వామి



గూడూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్‌గా గూడూరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామిని నియమిస్తున్నట్లు ఆదివారం కోఆర్డినేటర్ కపిల్‌వాయి దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



నెహ్రూసెంటర్: హెచ్ఐవీ వ్యాధితో మరణించిన వారి కోసం నిర్వహించే క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద క్యాండిల్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ బి.రమేష్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే మూడో ఆదివారం క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ కుసుమా రమేష్, పీపీటీసీటీ కౌన్సిలర్ సరస్వతీ, జ్యోతి, యాకేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులను విడుదల చేయాలి



కేసముద్రం/బయ్యారం/కొత్తగూడ: పోలీసులు అరెస్టు చేసిన సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకులు రాజన్న, దేవిరెడ్డి, జీవన్‌తోపాటు మరో నలుగురిని వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో దళ నాయకులను అరెస్టు చేయడంపై పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు శివారపు శ్రీధర్, కొట్టం అంజయ్య, బట్టు నాగేశ్వర్‌రావు, మహ్మద్ మదార్, బట్టమేకల రాజు, బెజ్జంకి బ్రహ్మాచారి, మునిగంటి సుధాకర్, బండి రాజు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

కేసముద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు తరాల సంపత్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

ఈఏపీ సెట్‌లో మెరిసిన విద్యార్థినులు



హర్షిత



సుస్మిత

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష టీఎస్ ఈఏపీ సెట్ –2024 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పొక్కల సదానందం ఆదివారం తెలిపారు. ఎంపీసీ ఇంజనీరింగ్ విభాగంలో పోల్కం హర్షిత 20,290 ర్యాంకు, తోకల సుస్మిత 64,000 ర్యాంకు, 10మంది విద్యార్థినులు వివిధ విభాగాల్లో ర్యాంకుల్లో ప్రతిభను కనబరిచారన్నారు.

రైతన్నకు తప్పని తిప్పలు

ఖానాపురం: ఆరుగాలం కష్టపడి పంటల సాగు చేసే రైతన్నకు తిప్పలు మాత్రం తప్పడం లేదు. ఆదివారం సాయంత్రం వాతావరణంలో భారీగా మార్పు చోటు చేసుకుంది. సబ్‌మార్కెట్ యార్డులో లారీలో ధాన్యపు బస్తాలను లోడుచేసే క్రమంలో భారీ వర్ష సూచన కనబడటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

గార్ల: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న విద్యావంతుడు తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. ఆదివారం గార్ల సమీపంలోని కృష్ణతారక్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రుల సదస్సులో ఆయన మాట్లాడారు. తీర్మాన్ మల్లన్న గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్గ విభేదాలకు తావులేకుండా కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ బట్టు నాగరాజు, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బి.సుందర్, శీలంశెట్టి ప్రవీణ్‌నాయుడు పాల్గొన్నారు.



గార్ల: సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

డోర్నకల్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై పదవీకాలం పూర్తికాకముందే రాజీనామా చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజకీయ స్వార్థం కోసం అవకాశవాదిగా మారారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరోపించారు. డోర్నకల్‌లో ఆదివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, నాయకులు సుమేర్‌చంద్, మాదా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుశీల్, వాజీద్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలి

మహబూబాబాద్ అర్బన్: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు పూర్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. నూతన ఉపాధ్యాయుల నియామకాలు జరిగే వరకు పాఠశాలల్లో విద్యా వలంటీర్లను, పారిశుధ్య కార్మికులను నియమించాలని, అసంపూర్తిగా ఉన్న మన ఊరు–మనబడి పనులకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సంజీవ, హరినాయక్, సురేష్, మంద వెంకట్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల సామగ్రి పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థులకు జిల్లా గ్రంథాలయంలో సుమారు రూ.25వేల విలువ చేసే పరీక్ష సామగ్రిని కాళోజీ వాకర్స్ సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దోలి సత్యనారాయణ, అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, గౌరవ సలహాదారులు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న గ్రంథాలయం చక్కటి అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి పట్టాభి లక్ష్మయ్య, సహ్యాలు హట్యానాయక్, కోట సుధాకర్, మద్యల రాజన్న, మాచర్ల సుధాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, శ్యామ్‌రావు, రవి పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పీడిత ప్రజల ఆశాజ్యోతి ‘పుచ్చలపల్లి’

కురవి: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లిడి కోటయ్య, నాయకులు మల్సూర్, పిట్టల వెంకన్న, మాలోత్ కిషన్, నల్లపు సుధాకర్, కట్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మల్లేశం, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రమేష్, వెంకటేశ్వర్లు, సరస్వతి, వెంకన్న, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని అబ్బాయిపాలెం, గుండెపుడి, తాళ్లఊకల్, ఎల్లంపేట మరిపెడ మండల కేంద్రంలో సీపీఎం–సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నందిపాటి వెంకన్న, కొండ ఉప్పలయ్య, బండా వీరస్వామి, జిన్నా లచ్చయ్య, జినక ఉపేందర్, రాజు,ఎర్ర వెంకన్న, కామిండ్ల వెంకన్న జినక రామమూర్తి పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గునిగంటి మోహన్, రామేశ్వరరావు, వెంకట్రామనర్సయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలో సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటం వద్ద పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మండా రాజన్న, కార్యదర్శి నంబూరి మధు, నాయకులు వెంకన్న, చంటి, తిరుపతిరావు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కుర్ర మహేష్, నాయకులు వెంకన్న, నాగమ్మ, రాజశేఖర్, మురళీ, జ్యోతి, సరిత, కవిత, రమ పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గునిగంటి మోహన్, నాయకులు సుధాకర్, రాంబాబు, యాకన్న, రమేష్ పాల్గొన్నారు.

గార్ల: సీపీఎం పార్టీ తొలితరం నాయకులు, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని గార్లలో నిర్వహించారు. తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, సుందరయ్య చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, సత్యవతి, రామకృష్ణ, పెద్దవెంకటేశ్వర్లు, హరినాయక్, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

తొర్రూరు: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని డివిజన్ కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, నాయకులు సోమిరెడ్డి, దర్గయ్య, తాళ్ల వెంకటేశ్వర్లు, సారయ్య పాల్గొన్నారు.



కురవి: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్



కేసముద్రం: తాళ్లపూసపల్లిలో..



తొర్రూరులో..



డోర్నకల్‌లో..

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి



మహబూబాబాద్ అర్బన్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను బలపర్చాలని, తనకు మొదటి ప్రాధాన్యత కల్పించి ఓటు వేయాలని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జడ్సన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం ఆయన ప్రచారం చేశారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తానని తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బాబురావు, సతీష్, రాజు మల్లయ్య, వీరన్న, నిరుద్యోగులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఎన్నిక

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో యాదవ సంఘం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘం పెద్దగొల్లగా గజ్జి లింగన్న, సారకొల్లగొల్లగా తోట అబ్బయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహేష్, రాము, ఐలయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించాలని వినతి

నెల్లికుదురు: మా స్థలాలు మాకు కేటాయించి ఆదుకోవాలని మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ ఇళ్ల స్థలాల బాధితులు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రామన్నగూడెం గ్రామ పరిధిలోని 62 సర్వే నంబర్‌లో 1998లో అప్పటి ప్రభుత్వం 8.3 ఎకరాల భూమిని ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిందన్నారు. పట్టాలు అందించి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేక పోయారని అన్నారు. కాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన పట్టాలున్న ప్రతి లబ్ధిదారులకు స్థలాలకు హద్దులు ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్న నర్సయ్య, ప్రభాకర్, రాములు, వీరస్వామి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్న రమేష్‌నాయక్

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమైనాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మొదటి రోజు రాత్రి ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు అధ్యయనోత్సవ వేద పారాయణం చేస్తుండగా, తొలక్కం ద్రావిడ ప్రబంధ సేవాకాలము, ఆరగింపుతో ఆలయ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ భక్తులచే బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి సేవ సమితి ప్రతినిధులు మేరుగు నరేష్‌గౌడ్,పల్లూరు భాస్కర్‌గౌడ్, చిక్కుల నరేష్, సమ్మెట సుధాకర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మరిపెడ రూరల్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



దంతాలపల్లి: మండల కేంద్రంలో 2006-07 బ్యాచ్ విద్యార్థులు



గూడూరు హైస్కూల్‌లో 2004-05 బ్యాచ్ విద్యార్థులు



తొర్రూరు: 2003-04 బ్యాచ్ విద్యార్థులు

మరిపెడ రూరల్: 23ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులు కలుసుకోవడంతో వారి సంతోషాలకు అవధులులేకుండా పోయాయి. మండలంలోని ఎల్లంపేట జెడ్పీఎచ్ఎస్ పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులైన మోహన్‌రావు, సోమయ్య, వీరస్వామిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి లింగంపల్లి దయానంద్, పూర్వవిద్యార్థులు లింగోజు వీరభద్రాచారి, దేవేందర్, మహేష్, బాలాజీ, రమేష్, లక్ష్మయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 2006–07 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేనం నిర్వహించారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వేణుమాధవరెడ్డి, నర్సింహారెడ్డి, రావు, అలువాల రవి, సుధాకర్, కరుణాసాగర్, హర్షవర్ధన్‌రెడ్డి పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

తొర్రూరు: మండలంలోని సాహితి హైస్కూల్ పాఠశాల 2003–04 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జినుగ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగార్జున, యాకాంబ్రం, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతరరెడ్డి, అయూబ్‌ఖాన్, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడి స్థలం కోసం గొడవ..

ఇరువర్గాలపై కేసు నమోదు

కురవి: గుడికి దారి ఇవ్వలేదనే కోపంతో శనివారం జరిగిన గొడవలో తేజావత్ రాందాసు తీవ్రగాయాలైన సంఘటన నారాయణపురం శివారు తేజావత్ తండాలో చోటుచేసుకుంది. బాధితులు రాందాస్, పరెంగస్‌ల కథనం ప్రకారం.. నారాయణపురం శివారు తేజావత్ తండాలో (కంచర్లగూడెం సమీపంలో) మారెమ్మ గుడి దారి కోసం శనివారం గొడవ జరిగింది. తండాకు చెందిన తేజావత్ సతీష్, రమేష్, భద్రులు మూకుమ్మడిగా దాడి చేసి తేజావత్ రాందాస్‌ను తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. మహబూబాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. తేజావత్ పరెంగస్ కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే గుడి దారి కోసం జరిగిన గొడవలో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయని, ఇరువర్గాలపై కేసు నమోదు చేయడం జరుగుతుందని కురవి ఎస్సై బి.గోపి ఆదివారం తెలిపారు.